# పరువు

## గొన్నలపల్లి సుబ్రహ్మణ్యం

పంచ పాత్రలో రాగి ఉద్ధరణితో– విభూతి పండును– ఎడమ అరచేతిలోకి గీరుకుని– రెండు బొట్లు నీళ్ళు వేసి– రెండు అరచేతులతో రుద్ది– పట్టిడు ముఖానికి అద్దుకున్నాడు. అద్దంలో ముఖాన్ని చూసుకుంటూ – సింధూరాన్ని విభూతి రేఖల మధ్య గుండ్రంగా దిద్దుతూ– వాడు– వెళ్ళాడా– లేదా' అడిగేడు సో మయాజులుగారు.

'ప్రయాణం అవుతున్నాడు' అంది ముక్తసరిగా భ్రమరాంబగారు.

'ఇంత జరిగాక– ఇక వుంటాడా వాడు' అంది శ్యామల పూలపళ్ళెం తండ్రి దగ్గర పెడుతూ.

"అయినామీరు అంత పట్టు పట్టడం బాగలేదు మామగారు. అతనసలే ముక్కోపి" అంది వరలక్ష్మి కాఫీగ్లాసు మామగారి ప్రక్కన వుంచి.

కోడలివంక తీక్షణంగా చూశాడాయన.

'నీచేత చెప్పించుకునే స్థితికి నేను దిగజారలేదు. ఐనా మంచేదో చెడేదో నాకు తెల్సు మీ అందరికీ నాదే తప్పులా వుంటుంది. వయస్సుకి పెద్దని కాబట్టి. అసలు మొదటి నుంచీ మీరంతానాకు ప్రత్యర్థులే" ఆవేశంగా అన్నాడాయన.

'ఆ మాట అని మనగలిగిన వాళ్ళెవరూ' సన్నగా అంది శ్యామల.

"సరి సరి మళ్ళీ అనవసరపు గోల ఎందుకు వూరుకోండి– వెళ్ళి పని చూసుకోండి" మందలించింది ఇద్దరినీ భ్రమరాంబగారు.

వాళ్ళిద్దరూ– వీళ్ళిద్దరివంకా మార్చి మార్చి చూస్తూ వెళ్ళిపోయారు అవతలకి.

సోమయాజులు ఆ వూళ్ళో పెద్ద పురోహితుడు. నిత్యాగ్నిహోత్రుడు. నిష్ఠా అనుష్ఠాని.

తాపట్టిన కుందేటికి మూడేకాళ్ళు' అనే మనిషి ఆయన. రాజీ పడటం ఆయన మనస్తత్వానికి విరుద్ధం.

ఆ ఇంట్లో అందరూ ఆయన్ని గౌరవిస్తారు. భయమూ వుంది– కానీ కొన్ని కొన్ని విషయాల్లో ఆయన్ని నిరసిస్తారు.

అలా సాగుతున్న ఆ సంసారంలో పెద్ద ప్రశ్నగా మిగిలిపోయాడు రవి. మొదటి నుంచీ రవి– సోమయాజులుగారివి భిన్న ధృవాలు. ఇద్దరి మధ్య క్షణకాలం పడదు. ఇద్దరి పంథావేరు. ఆలోచనలు వేరు. దృక్పథాలువేరు,

"ఏనాటికైనా వాడివల్ల ఈ ఇంటి పరువు పోతుంది. మనందరినీ రోడ్డున వేస్తాడు వాడు–" అంటాడు సోమయాజులుగారు రవిని గురించి.

రవికి ఆయనంటే లెక్కలేదు!

అసలు భయంలేదు!!

ఈనాడు రవి చేస్తున్న పని... అలా అలా... వచ్చి సోమయాజులుగారి చెవిన దూరింది.

తన పరువు పోయినట్టుగా భావించేడు ఆయన.

ఆయన అహం దెబ్బతిన్నది.

రవి టౌన్ కెళ్ళాడు ఉద్యోగ ప్రయత్నం కోసం అలాగే అనుకున్నాడాయన. కానీ జరిగింది వేరు. అందుకే రవిని పిలిపించేడు అర్జంటుగా వెనక్కి.

'ఏవిటీ– టౌన్‌లో నువ్వు చేస్తున్న పని' తీక్షణంగా అడిగాడాయన.

రవి తడబడ్డాడు. అతను అనుకోలేదు. ఇలా సంజాయిషీ– ఇవ్వవలసి వచ్చిందని.

"మీ మాటలు నాకు అర్థంగావట్లేదు. అసలేం చేశాడు వాడు" భర్తని అడిగింది భ్రమరాంబగారు.

భార్యవేపు చీత్కారంగా చూశాడాయన.

అర్థంగాలేదు ఆడవాళ్ళు ముగ్గురికి. అయోమయంగా చూస్తుండిపోయారు రవివంకా– సోమయాజులువంక.

హడావిడిగా వచ్చేడు విశ్వం. "ఏవిటి వున్న పళంగా రమ్మని కబురు చేశారు" అంటూ.


రవిని చూస్తేనే అర్థమైంది అతనికి అసలు విషయం.

భార్యవంక– కూతురివంకా– కోడలివంకా– చూశాడు సోమయాజులుగారు. కళ్ళతోనే సంజ్ఞ చేశాడు వినమన్నట్టుగా.

"నువ్వు చూసింది చూసినట్టు చెప్పు" గంభీరంగా అన్నాడాయన విశ్వంతో.

విశ్వం తూ.చ. తప్పకుండా చూసింది, చూసినట్టుగా చెప్పేడు.

రవి వంక కన్నార్పకుండా చూస్తూ వుండిపోయారు వాళ్ళు ముగ్గురు. విశ్వం నోటి వెంట విన్న ప్రతి అక్షరం వాళ్ళని భయభ్రాంతుల్ని చేసింది.



'వెళ్లొస్తానండి' విశ్వం వెళ్లిపోయాడు ఈ గొడవతో తనకెందుకన్నట్టుగా.

రవి చేసిన తప్పు అర్థమైంది ఆ ముగ్గురికి. రవి ఉద్యోగం చేయటంలేదు. రిక్షా త్రొక్కుతున్నాడు. అందునా గవర్నమెంటు హాస్పటల్ వద్ద శవాల బాడుగకి వేస్తున్నాడు.

'ఇదేం పనిరా' అంది భ్రమరాంబగారు.

"నీకేం అంత కర్మకాలిందయ్యా- రిక్షా త్రొక్కటానికి శవాలని బాడుగ వేయటానికి.

'ఇదేం జబ్బు నీకు- అసలు మనవంశమేమిటి' ప్రశ్నించింది శ్యామల.

'తప్పేమిటి అన్నాడు రవి.

"తప్పా- తప్పున్నరా... చేసింది చాలక నిర్వాకం ఇంకా మాట్లాడుతున్నావు. బ్రష్టు పట్టించావు గదరా" మందలించింది భ్రమరాంబగారు.

"నేను చేసిందాంట్లో నాకేం తప్పు అనిపించలా మగాడన్నాక కష్టపడాలి- రూపాయి సంపాదించాలి- నేనేం కాని పని చెయ్యటంలేదు కష్టపడుతున్నాను." రవి సమాధానం.

"చేసిన నిర్వాకం చాలుగాని- నాన్నగారికి తప్పయిందని క్షమార్పణలు చెప్పి- ఆ బట్టలు తడిపి స్నానం చేసి ఇంట్లోకి రా..." అంది శ్యామల.

'మాకు పంపిన డబ్బు అంతా అదేనా' అడిగారు సోమయాజులుగారు.

అవునన్నట్టుగా తలవూపాడు రవి.

"ఛీ... నా కడుపున చెడబుట్టేవుగదరా...

## పరువు

దగుల్బాజీ, నిప్పులాంటి నా వంశానికి కళంకం తెచ్చావుగదరా... ఇంత చదువుకున్నావు తగలబెట్టనా... నా పరువు మంట గలిపేవుగదరా..." కస్సుమన్నాడు సోమయాజులుగారు.

"నాన్నా... కష్టపడటం పరువు పోవటమైతే- ఏ దన్నా ఉద్యోగం చేసినా అక్కడా కష్టపడాలి. అప్పుడూ అదీ పరువు పోవటమే అవుతుంది. అలాంటప్పుడు సోమరిలా తిని కూర్చుంటే సరిపోతుంది. ఎందుకీ చదువులు ఈ ఉద్యోగాలు- ప్రయత్నాలు.

"అతి తెలివి తేటలు చూపకయ్యా రవి- జరిగిందేదో జరిగింది. ఇక నువ్వు టౌన్‌కి వెళ్లకు. వచ్చే ఉద్యోగం ఇక్కడికే వస్తుంది-" వరలక్ష్మి మందలింపుగా అంది.

"ఇలాంటి పిచ్చి పిచ్చి పనులు కట్టి పెట్టి- కొంపపట్టున పడివుండు" హెచ్చరించేడు సోమయాజులుగారు.

"నావల్లగాదు- ఖాళీగా తిని తిరగలేను. ప్రతి పైసా కోసం మిమ్మల్ని దేబిరించలేను." అన్నాడు రవి.

"అంత ఖాళీగా తిరగలేకపోతే... ఇంకా పై చదువులు చదువుకో-

"ఇక నేను చదవలేను. ఎంత చదివినా ఈ రోజుల్లో ఉద్యోగాలు రావు. ఆ ప్రయత్నంలోనే వయస్సు దాటిపోతుంది. అప్పుడు కష్టపడలేను. కూర్చుని తినలేను. బ్రతుకు త్రిశంకుడి స్వర్గంలా మారుతుంది. ఈ చదువులకోసం ఖర్చు పెట్టడం శుద్ధ దండుగ. ఆ డబ్బుతో శ్యామల పెళ్లి చెయ్యవచ్చు.

"ఐతే అంత సంపాదించాలనే కోరికవుంటే- ఉద్యోగాల మీద నమ్మకం లేకపోతే- నువ్వొ పురోహితం నేర్చుకో, పాడికుండ లాంటిది అది" కసువు వూడుస్తూ అంది భ్రమరాంబగారు.

"నేర్చుకోను- నా దృష్టిలో ఇవన్నీ మూఢా చారాలు. నాకు వాటిమీద నమ్మకంలేదు. నేను నేర్చుకోను. "రిక్షా త్రొక్కటం- శవాలు బాడుగ వేయటంకంటె తీసిపోయిందా ఇది హేళనగా అంది శ్యామల.


"ఆ అంతా మాయ... ఇన్ని మాటలు ఎందుకు నాకు కష్టపడటంలోనే ఆనందముంది." తెగేసి చెప్పాడు రవి.


"అయితే నీ పద్ధతి మార్చుకోవన్న మాట- మా మాట మీద లక్ష్యం లేదన్న మాట- ఈ కుటుంబం పరువు- మర్యాదలతో నీకు సంబంధం లేదన్న మాట" అడిగేడు సోమయాజులుగారు. రవి వితండవాదం ఆయనకి భరించలేనట్టుగా వుంది.

మౌనంగా వుండిపోయాడు. రవి.

"చెప్పు సమాధానం కావాలి. బెల్లం కొట్టిన రాయిలా నిలబడతావేం" గర్జించేడు ఆయన అసహనంగా భరించలేక.






"పరువు... పరువు... ఈ పరువు ఏ పాటి కూడు బెడుతుంది ఈ ఇంటిమీదవున్న అప్పు తీరుస్తుందా??? శ్యామల పెళ్లి చేస్తుందా? ప్రతిదానికీ పరువు- మర్యాద- ప్రతిష్ట- నిప్పులాంటి వంశం అని గుంజుకుంటారు. ఇంత మంది దండయాత్ర చేశారు. నేనేం కాని పని చేశాను. రిక్షా త్రొక్కాను. అదేం తప్పుకాదే. రిక్షా అనేక మంది ఎక్కుతారు. రోగిష్టి వాళ్లు మంచివాళ్లు- మైలవాళ్లు- అవన్నీ మనకి అంటుతాయా ఆలోచించండి. ఆవేశంగా అన్నాడు రవి.

"కానిపని ఏం చేశానని అడుగుతున్నావా! మమ్మల్ని ఎదురు ప్రశ్న వేస్తున్నావు. ఎంత ధైర్యంరా నీకు' రవి చెంప ఛెళ్లు మనిపించేడు సోమయాజులుగారు.

అవమానంతో రవి ముఖం కందిపోయింది.

"చాల్లే వూరుకోండి . మీ తామసం మీరూనూ నెమ్మదిగా నచ్చ చెప్పటం పోయి" భ్రమరాంబ అడ్డంవచ్చింది.

"నీ అలుసు చూసుకునే వీడిట్లా తయారైనాడు. నేను ఏనాడో చెప్పాను. వీడొట్టి అప్రయోజకుడని పనికిరానివాడని విన్నావా?- ఏనాటికైనా మన పేరు నిలబెట్టేది- మన మోహన ఇంత కూడు పడేసేది వాడే అన్నావు. చూడు వాడినిర్వాకం"

"నాన్నా ఆగండి... నా మీద కసి ఆమె మీద చూపిస్తారేం? మొదటి నుంచీ మీకూ నాకు పడదు... ఇది మనిద్దరి మధ్య వ్యవహారం. ఇందులో అమ్మ ప్రమేయం ఏం వుంది. నామాట వినండి నాకు నచ్చిన మార్గంలోనే నేను పయనిస్తాను. ఎవరి మాట వినేదిలేదు. మీ ఎవరి ఇష్టా ఇష్టాలతో ప్రమేయంలేదు నాకు. అంతే ఇదీ నా కడపటి నిర్ణయం.

సోమయాజులుగారు అగ్గిలా మండి పడ్డాడు.

"సరైతే మా నిర్ణయం కూడా విను. మా మాట కాదన్నప్పుడు నా నిర్ణయం తెల్సుకుని వెళ్లటం మంచిది. ఈ రోజువరకూ నీకు అన్నీ సమకూర్చేను. చదువుకుని పైకి వస్తావని. నీ నెత్తిన పెద్దమ్మవారు కూర్చుందిలా వుంది. నీకు పెడబుద్ధులు పుట్టాయి. నా ఇంట్లో నీకు స్థానంలేదు. ఈ కుటుంబపు పరువు మర్యాదలతో ఇకనీకు సంబరిధంలేనప్పుడు- ఈ ఇంట్లో వాళ్లతో నీకు ఏ అనుబంధం లేనప్పుడు- నీ నీడ ఈ ఇంటి మీద పడటానికి వీలులేదు. వెళ్లు జీవితంలో నీ ముఖం నాకు చూపించకు...

"మంచిది. ఈ అర్థంలేని భేషజాలంటే నాకు గిట్టవు. ఇప్పటికే ఈ ఇంటిమీద తీర్చలేనంత అప్పు వుంది. ఇంకా శ్యామల పెళ్లి చెయ్యాలి. వాస్తవాన్ని మీరు గ్రహించటంలేదు. రూపాయి విలువ తెలుసుకోవటంలేదు. పరువు పోతుందన్న బాధ- అనుచిత కార్యం చేస్తున్నాననే ఆలోచన తప్ప- లోతుగా ఆలోచించటం మీకు తెలియదు. త్వరలో నే తెలుస్తుంది. అప్పుడు ఈ పరువు మిమ్మల్ని ఎలా ఆదుకుంటుందో చూడండి. అలాంటి పరిస్థితి వస్తే నేనున్నానని మరచిపోవద్దు. బైదీ బై. ఈ రాత్రి బస్సులులేవు. ఉదయాన్నే వెళ్లిపోతాను. అందాకా మీ పంచలో ఎవరో బాటసారి ననుకుని కాస్త చోటివ్వండి.

* * * * * *

సోమయాజులు కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. పెళ్ళివారు విడిదిలో బసచేశారు. ఇంట్లో అందరూ హడావిడిగావున్నారు. ఇప్పటికి రెండు సార్లు కబురుచేశారు పెళ్ళివారు కట్నం డబ్బుకోసం. ఇస్తానన్న భూషయ్య పత్తాలేడు. టౌను నుండిరాలేదు. ఇప్పుడెలా చేయటం - ఏఁవీ బోధపడటంలేదు సోమయాజులుకి. తన పరువు నట్టేట కలవబోతున్నది. కాసేపాగితే పెళ్ళివారు అల్లరిచెయ్యకమానరు. పిల్ల పెళ్ళి ఆగిపోతుంది. ఇక జీవితంలో పిల్ల పెళ్ళికాదు. ఆ ఆలోచన అయన్ని నిలవనీయటంలేదు.

కృష్ణశాస్త్రిని పిలిచి భూషయ్య ఇంటికి వెళ్ళిరమ్మన్నాడు. అక్కడనుండి మామూలు సమాధానం వచ్చింది. భూషయ్య యింకా తిరిగిరాలేదు పట్నం నుంచి. పెళ్ళివారికి ఎదురుపడటానికి మొహంచెల్లటంలేదు సోమయాజులుకి. పెళ్ళివారిని భోజనాలకి రమ్మనమని కృష్ణశాస్త్రిచేత కబురంపించేడు. ఇప్పుడు బయటపడతారు వాళ్ళు - ఏఁవంటారో... భయంభయంగా కృష్ణశాస్త్రి కిటికీలోంచి తండ్రిని చూస్తున్నాడు.

సోమయాజులుగారి ముఖం కళావిహీనంగా వుంది. పెళ్ళివారు భోజనాలకి వచ్చేరు. ఇదే అదును "బావగారు ఒక్కమాట రండి" పిల్చేడు వియ్యంకుడ్ని.

"ఇలా జరుగుతున్నందుకు మాకు బాధగావుంది. అన్యథా భావించకండి. త్వరలో సర్దుతాను. అందాక ఈ నోటు వుంచుకోండి".

వియ్యంకుడు జోరుగా నవ్వేడు. "బావగారూ ఎకసక్కాలు ఆడుకునే వయసువాళ్ళమా మనం. మీ అబ్బాయి యిందాక యిచ్చివెళ్ళాడు పైకం మొత్తం. 'బజారు నుంచి వస్తూ మీకిచ్చిరమ్మన్నారు నాన్నగారు. నేను వేరే పనిమీద వెడుతున్నాను - లెక్కపెట్టుకోండి అన్నాడండి మీ రవి".

సోమయాజులుకి నోట మాటరాలేదు.

ఆ తర్వాత వారంకి రవి నుంచి ఉత్తరం అందింది.

బ్ర. వే. నాన్నగార్కి - ఉభయకుశలోపరి - అమ్మని అడిగినట్లు చెప్పండి. శ్యామలకి నా ఆశీస్సులు. భూషయ్య ద్వారా టౌనులో తెలిసింది విషయమంతా. అందుకే వచ్చి కట్నం డబ్బులు సర్దివెళ్ళాను. ఈ రిక్షా త్రొక్కిన - శవాలు బాడుగ డబ్బులు ఒక కాపురం నిలబెట్టాయి. కొంతమంది పరువు నిలబెట్టింది. వాటికి సార్థకత చేకూరింది. డబ్బుకి వృత్తికి - అంటూ మైలా.....పరువు - మర్యాద లేవని నా అభిప్రాయం. ఇప్పటికైనా నా అభిప్రాయంతో ఏకీభవిస్తారనుకుంటా -

మీకు ఏమీగాని

మీ రవి.

ఆ రాత్రి భార్యతో అన్నాడు సోమయాజులుగారు - నాకు ఒక జీవిత సత్యం తెల్సింది" అని.

డబ్బుకి - వృత్తికి అంటూ - మైలా - పరువు - మర్యాదా - లాంటివి ఏమీలేవు అని. □